క్లుప్తంగా

నేడు ఎక్సైజ్ కార్యాలయం ప్రారంభం

పాలమూరు: జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సర్కిల్ కార్యాలయాన్ని శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ప్రారంభించనున్నారు. ఇదివరకు సదరు కార్యాలయం పాల్‌సాబ్ గుట్టలోని అద్దె భవనంలో కొనసాగింది.

ఉమ్రా యాత్ర అదృష్టం

స్టేషన్ మహబూబ్‌నగర్: పవిత్ర మక్కా షరీఫ్ ఉమ్రాయాత్ర చేయడానికి అవకాశం రావడం అదృష్టమని ఎదిర జామీయా మసీద్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ హకీం అన్నారు. ఉమ్రా యాత్రకు వెళ్తున్న మహ్మద్ అఫ్రోజ్, మహ్మద్ హనీఫ్‌లను మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. ప్రజల క్షేమం కోసం ప్రార్థించాలని కోరారు. కార్యక్రమంలో హఫీజ్ హకీం, హఫీజ్ ఫేరోజ్, మౌజన్ బాబర్, అజీజుల్లా, అబ్దుల్ సలాం, నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే లక్ష్యం

భూత్పూర్: సీఎం కేసీఆర్ మత్స్యకారుల సంక్షేమమే లక్ష్యంగా, వారిని ఆర్థికంగా అభివృద్ధి చేసేందు కోసమే ఉచితంగా చేపపిల్లలను పంపిణీ చేస్తున్నట్లు ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి తెలిపారు. మద్దిగట్లలోని మద్దిఖాన్ చెరువులో శుక్రవారం చేప పిల్లలను వదిలిన సందర్భంగా మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రియాంక, సీనియర్ నాయకులు ఉన్నారు.

క్రీడల్లో రాణించాలి

మహబూబ్‌నగర్ క్రీడలు: క్రీడల్లో రాణించేవారికి మంచి భవిష్యత్తు ఉంటుందని మైనార్టీ గురుకులాల అకాడమిక్ కోఆర్డినేటర్ మహ్మద్ సలీం అన్నారు. ఇటీవల జరిగిన ఉమ్మడి జిల్లా మైనార్టీ గురుకులాల క్రీడల్లో ప్రతిభచాటిన విద్యార్థులను శుక్రవారం జిల్లా కేంద్రంలోని మైనార్టీ బాలుర-2 పాఠశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బుషీరా ఫాతిమా, పీఈటీ క్రాంతి, రమేష్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్‌కు ఎంపిక

జడ్చర్ల టౌన్: అక్టోబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ కరాటే పోటీలకు శుక్రవారం పట్టణంలో క్రీడాకారుల ఎంపిక నిర్వహించారు. 200మంది విద్యార్థులు పాల్గొన్నారు. అండర్ 14, 17 విభాగాల్లో ఎంపిక నిర్వహించినట్లు స్పోర్ట్స్ కరాటే డూ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శంకర్ నాయక్ తెలిపారు. కౌన్సిలర్ సతీష్, ఉమ్మడి జిల్లా టోర్నమెంట్ కమిషన్ చైర్మన్ కృష్ణయ్య పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

అడ్డాకుల: శాఖాపూర్‌కి చెందిన సుభాష్ వ్యవసాయ పొలంలోకి అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అక్రమంగా ప్రవేశించి రాతి స్తంభాలను విరగొట్టారని పోలీసులు తెలిపారు. ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

గ్రామకమిటీ ఎన్నిక

రాజాపూర్: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో ఆరుగ్యారంటీ పథకాలను అమలు చేస్తుందని మండల అధ్యక్షులు కొప్పెరి కృష్ణయ్య అన్నారు. శుక్రవారం రాయపల్లి గ్రామకమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దూళ్ల లింగమయ్య ఉపాధ్యక్షుడిగా గణేష్‌గౌడ్, యువజన అధ్యక్షుడిగా పాలెం మహేష్‌గౌడ్ ఉపాధ్యక్షుడిగా వీరస్వామి తదితరులు ఎన్నికయ్యారు. మహేష్‌గౌడ్, శివ పాల్గొన్నారు.

30మందికి వైద్య పరీక్షలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'సఫాయి మిత్ర సురక్ష'లో భాగంగా శుక్రవారం పట్టణంలోని పాతపాలమూరు యూపీహెచ్‌సీలో 30 మంది పారిశుద్ధ్య కార్మికులు పరీక్షలు చేయించుకున్నారు. వైద్యాధికారులు గౌతమి, రమ్య, రాహుల్, ఖాజా వారికి సూచనలు చేశారు.

స్వామినాథన్‌కు నివాళి

దేవరకద్ర: హరిత విప్లవ పితామహుడు ఎమ్మెస్ స్వామినాథన్ సిఫారసులను వెంటనే అమలు చేయాలని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు సాంబశివుడు డిమాండ్ చేశారు. కొత్త బస్టాండ్ చౌరస్తాలో ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షులు కొండారెడ్డి, జిల్లా కార్యదర్శి నర్సిములు, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం

- ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: బీఆర్ఎస్ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం రాష్ట్రం అభివృద్ధితో పాటు సంక్షేమంలోనూ దూసుకుపోతుందని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం బాలానగర్ మండల పరిధిలోని తిరుమలగిరి గ్రామానికి చెందిన సింగపోగు శివకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా వచ్చిన రూ.8 లక్షల విలువ చేసే టాటా ఏస్ వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు వివరించారు. అన్ని రంగాలలో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నట్లు పేర్కొన్నారు. సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ వెంకటచారి, గిరిజన రాష్ట్ర నాయకుడు లక్ష్మణ్ నాయక్, శ్రీనివాస్ రావు, జగన్ నాయక్, చెన్నారెడ్డి, సుప్ప ప్రకాష్, పోచయ్య, పాల్గొన్నారు.



వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

దీర్ఘకాలిక రుణాలపై తీర్మానం

అడ్డాకుల: మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శుక్రవారం అధ్యక్షుడు జితేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సొసైటీ డైరెక్టర్లతో మహాసభ నిర్వహించారు. సొసైటీ ద్వారా కొత్త రుణాలు ఇవ్వాలని తీర్మానం చేశారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందిస్తున్నట్లు అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీఈఓ వెంకటయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు శెట్టినాయక్, డైరెక్టర్లు చంద్రశేఖర్, కృష్ణయ్య, రాజవర్ధన్‌రెడ్డి, వీబీ.రాజు, నర్సింహ్మారెడ్డి తదితరులు ఉన్నారు.

దీర్ఘకాలిక రుణాలిస్తాం

అడ్డాకుల: పోల్కంపల్లి సింగిల్‌విండో వద్ద శుక్రవారం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాజన సభను నిర్వహించారు. సొసైటీ ద్వారా దీర్ఘకాలిక రుణాలను ఇవ్వాలని తీర్మానించారు. గొర్రెల రుణాలకు సంబంధించి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఈఓ భాస్కర్‌గౌడ్, ఉపాధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, డైరెక్టర్లు తదితరులు హాజరయ్యారు.

నేడు బీజేపీలో రైతురాజ్యం విలీనం

జడ్చర్ల టౌన్: రైతురాజ్యం పార్టీని శనివారం బీజేపీలో విలీనం చేస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు యం.బి. బాలకృష్ణ శుక్రవారం జడ్చర్ల విలేకరులకు తెలిపారు. రాష్ట్ర కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, చేరికల కమిటీ చైర్మన్ రాజేందర్‌లతోపాటు మరికొందరు నాయకుల సమక్షంలో విలీనం ఉంటుందన్నారు. బసప్ప, సునీత, రాంచంద్రయ్య, శేఖర్‌రెడ్డి, నిరంజన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీల భిక్షాటన

భూత్పూర్: అంగన్‌వాడీలు సమ్మెలో భాగంగా శుక్రవారం భూత్పూర్ చౌరస్తాలో భిక్షాటన చేపట్టారు. తమను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పుష్పలత, లక్ష్మి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి

అడ్డాకుల: గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు గుర్తించి సకాలంలో వాటిని పరిష్కరించే విధంగా బాధ్యతతో పనిచేయాలని ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. పలువురు ప్రజాప్రతినిధులు సమస్యలను సభ దృష్టికి తెచ్చారు. పెద్దమునుగల్‌ఛేడ్‌లో తాగునీటి సమస్య ఏర్పడిందని ఎంపీటీసీ చంద్రయ్య, చౌడాయపల్లి తాగునీటి సమస్య తీర్చడం లేదని సర్పంచ్ శ్రీకాంత్ తెలిపారు. ఆర్ఎంపీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని శాఖాపూర్ సర్పంచ్ జయన్నగౌడ్, సీజనల్ వ్యాధుల నేపథ్యంలో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఎంపీపీ పేర్కొన్నారు. పొన్నకల్‌లో ప్రభుత్వ పనులకు ఇసుక అనుమతి ఎందుకు ఇవ్వడం లేదని ఎంపీపీ అధికారులను నిలదీశారు. గ్రామాల్లో జరిగే ప్రైవేటు పనులకు అనుమతి ఇస్తున్నప్పుడు.. ప్రభుత్వ పనులపై నిర్లక్ష్యం తగదన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాధిక, ఎంపీడీఓ మంజుల, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి

మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

జడ్చర్ల టౌన్: మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సీడీఎఫ్ నిధుల ద్వారా ప్రతిపాదించిన పనులకు, ఇప్పటి వరకు చేపట్టిన సీసీరోడ్లు, కాల్వల నిర్మాణాలు తదితర అంశాలపై సభ్యులు ఆమోదం తెలిపారు. మున్సిపాలిటీలో నాలుగు నెలలుగా విద్యుత్ లైట్లు సరఫరా లేకపోవటం వల్ల ఇబ్బందులు ఉన్నాయని కౌన్సిలర్లు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. లైట్ల సరఫరాకు తీర్మానం చేశారు. మున్సిపాలిటీలో చేపట్టిన గణేష్ నిమజ్జనం కోసం రూ.10 లక్షలు ప్రతిపాదింతగా కొందరు కౌన్సిలర్లు వ్యతిరేకించి రూ.5లక్షలకు తగ్గించాలని సూచించారు. ఈ సందర్భంగా కొంత వాగ్వాదం చోటు చేసుకుంది. అదేవిధంగా పందులకు వస్తున్న వ్యాధుల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని, పందులను పూర్తిగా తొలగించాలని సభ్యులు కోరారు. కుక్కల సమస్య బాగా ఎక్కువయ్యిందని నియంత్రించాలని పేర్కొన్నారు. ఈ విషయంలోనూ కొంత వాగ్వాదం చోటు చేసుకుంది. సమావేశంలో కమిషనర్ మహమూద్ షేక్, వార్డు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛత కార్యక్రమాలను విజయవంతం చేయాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: 'స్వచ్ఛతా హీ సేవ'లో భాగంగా ఈనెల 30న, అక్టోబర్ 1న చేపట్టే కార్యక్రమాలను విజయవంతం చేయాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ వాణీకుమారి కోరారు. శుక్రవారం మెప్మా కార్యాలయ భవనంలో ఆర్‌పీలు, మహిళా సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రెండు రోజుల్లో కేటాయించిన వార్డులలో ఎక్కడికక్కడ పరిశుభ్రత కార్యక్రమాల్లో అందరూ భాగస్వాములు కావాలన్నారు. స్థానికులతో కలిసి స్వచ్ఛతపై ప్రతిజ్ఞతో పాటు రోడ్లు, పరిసరాలు శుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గురులింగం, రవీందర్‌రెడ్డి, మెప్మా సీఓలు ఆంజనేయులు, యాదయ్య, దేవమ్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే మౌలాలిగుట్ట వద్ద ఉన్న శానిటేషన్ రిసోర్స్ పార్కులోని ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు (ఎఫ్ఎస్‌టీపీ) వ్యర్థాల శుద్ధిపై చేస్తారో శ్రీనివాసకాలనీలోని వద్మాలయ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులకు అవగాహన కల్పించారు.

సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



సమావేశంలో పాల్గొన్న గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్ తదితరులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గౌడ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, జిల్లా సంఘం అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ అన్నారు. శుక్రవారం స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈత చెట్లపై బకాయిలను ప్రభుత్వం మాఫీ చేసిందన్నారు. వైన్స్ దుకాణాల్లో గౌడలకు రిజర్వేషన్లు కల్పించడంతో పాటు, గౌడ భవనం కోసం రూ. 3 కోట్లు మంజూరు చేసిన ఘనత మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌దే అన్నారు. హైదరాబాద్‌లో మాదిరిగా భవిష్యత్తులో జిల్లా కేంద్రాల్లో నీరా కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తున్నట్లు వివరించారు. మంత్రికి ధన్యవాదాలు తెలిపేందుకు అక్టోబర్ 1న గౌడ ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వహిస్తున్నామని పెద్ద సంఖ్యలో గౌడలు హాజరు కావాలని కోరారు. భాగన్నగౌడ్, లక్ష్మణ్, ప్రతాప్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రజాగర్జనను విజయవంతం చేయండి

కోయిల్‌కొండ: ప్రధాని నరేంద్రమోదీ పాలమూరు ప్రజాగర్జన సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాయకులు రాములుగౌడ్, వెంకట్రామిరెడ్డి, గోవిందునాయక్, శ్రీధర్, చెన్నయ్య, ఆనంద్‌రెడ్డి, వేణు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ రూరల్: కోడూర్‌లో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు రాజుగౌడ్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ప్రభారీ వీరల్లి చంద్రశేఖర్ అక్టోబర్ 1న ప్రధానమంత్రి సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. మణికొండ సర్పంచ్ గంగన్న, మండల ప్రధాన కార్యదర్శి మహేష్‌గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి

మహబూబ్‌నగర్ రూరల్: ప్రధాని మోదీ సార్వత్రిక ఎన్నికల(2014) సమయంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ చేస్తామని మాట ఇచ్చి విస్మరించారని ఎమ్మార్పీఎస్ (టీఎస్) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. మాట తప్పిన ప్రధానిని మహబూబ్‌నగర్ సభలో అడ్డుకుంటామన్నారు. శుక్రవారం స్థానికంగా ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. వర్గీకరణపై స్పష్టమైన వైఖరిని ప్రకటించాలన్నారు. మాదిగ, ఉపకులాల ఓట్లతో అధికారంలోకి వచ్చి, వారినే విస్మరిస్తే తగిన గుణపాఠం చెబుతామన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి నరేష్‌కుమార్, కార్యదర్శి శ్రీను, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ జయన్న, నాయకులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించాలి



కోయిల్‌కొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యాన్ని అందించాలని సర్పంచ్ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ నరేష్ బృందం వైద్యపరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. డాక్టర్ అర్చన, దిలీప్ పాల్గొన్నారు.

వినాయకుడి లడ్డూ రూ. 70వేలు

కోయిల్‌కొండ: మండలంలోని పారుపల్లిలో శివగణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శివాలయంలో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూను వేలం పాటలో మాజీ సర్పంచ్ కావాలికృష్ణయ్య రూ. 70,116కు దక్కించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మాణిక్యమ్మ, వైస్‌ఎంపీపీ కృష్ణయ్య, ఉపసర్పంచ్ చెన్నమ్మ, భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

మట్టిసేకరణ



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో తపాలాశాఖ ఆధ్వర్యంలో నెహ్రూ యువ కేంద్రం సహకారంతో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల కుటుంబ సభ్యులను కలిసి సత్కరించి వారి ఇంటి నుంచి మట్టిని సేకరించారు. సూపరింటెండెంట్ ఎం.ఎ.అలీం, ఐపీలు విద్యాసాగర్, విక్కికుమార్ సింగ్, పోస్ట్ మాస్టర్ నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా



మహబూబ్‌నగర్ రూరల్: ఆశా కార్యకర్తలు శుక్రవారం అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అంతకు ముందు ర్యాలీ నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తల విషయంలో ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలన్నారు. అనంతరం వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి బి.చంద్రకాంత్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల సమ్మె శుక్రవారం కొనసాగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

రాజాపూర్: మండల కేంద్రంలో శుక్రవారం ఆశా కార్యకర్తల సమ్మె కొనసాగింది. ఈ సందర్భంగా ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

తీర్మానానికి విరుద్ధంగా భూమిపూజ!

బాలానగర్: గ్రామ పంచాయతీ తీర్మానం చేసినా అందుకు విరుద్ధంగా జీపీ భవనానికి భూమిపూజ చేశారని మన్నెగూడ సర్పంచ్ మోతీ అన్నారు. మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డితో విషయంపై వార్డు సభ్యులతో కలిసి శుక్రవారం మొర పెట్టుకున్నారు. ఇష్టారాజ్యంగా శుక్రవారం ఎంపీడీఓ కృష్ణారావు, ఏఈ హలీం సమక్షంలో భూమిపూజ చేశారని వివరించారు. వార్డు సభ్యులు చత్రు, బుజ్జి, దాకీ తదితరులు ఉన్నారు. కాగా ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామాల్లో చేపట్టే పనులపై కలిసికట్టుగా నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగాలన్నారు. విషయంపై అధికారులతో మాట్లాడతానని, అభివృద్ధికి ఎవరూ ఆటంకం కలిగించరాదని అన్నారు. మరోమారు అందరూ కలిసి చర్చించుకుని నిర్ణయం తీసుకుని పనులు చేపట్టాలని సూచించారు. విషయంపై డీపీఓ వెంకటేశ్వర్లును వివరణ కోరగా గ్రామ హెడ్‌క్వార్టర్‌లో భూమి లేనిపక్షంలో పంచాయతీ తీర్మాణం మేరకు నిర్మాణం చేపడతారని, ప్రస్తుతం భూమి అందుబాటులో ఉన్నందున కాలయాపన చేయకుండా పనులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు వివరించారు.

గుండెను రక్షించుకుందాం

జడ్చర్ల టౌన్: మన గుండెను మనమే పరిరక్షించుకోవాలని కార్డియాలజిస్ట్ డా. హరీష్ పిలుపునిచ్చారు. ప్రపంచ హృదయ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఆహారపు అలవాట్లు మార్చుకోవటం ద్వారా గుండెను పరిరక్షించుకోవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డా. అప్పియా చిన్నమ్మ, అధ్యాపకులు పాల్గొన్నారు.









టీ హోటల్‌లో ఘర్షణ

జడ్చర్ల: మండల పరిషత్ కార్యాలయం ఎదుట గల ఓ టీ హోటల్‌లో శుక్రవారం ఘర్షణ చోటు చేసుకుంది. సీఐ రమేశ్‌బాబు కథనం మేరకు.. పాతబజార్‌కు చెందిన కృష్ణ టీ తాగేందుకు వెళ్లిన సమయంలో హోటల్ యజమాని వసీంతో గొడవ జరిగింది. ఘటనలో టీ కప్పుతో వసీంపై దాడి చేయగా గాయపడ్డాడు. దీంతో బాధితుడు 100 డయల్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు శ్రీను, వెంకటరమణ అక్కడికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ క్రమంలో కృష్ణ పోలీసులపైకి ఎదురు తిరిగి చేతులతో వెనక్కి తోశాడు. కాగా ఘటనపై వసీం ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

భార్యను కొట్టిన ఫిర్యాదుపై కేసు: పాతబజార్‌కు చెందిన సరితను భర్త కృష్ణ కొట్టిన ఘటనకు సంబంధించి శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేశామని సీఐ తెలిపారు.

ఉచిత విద్యుత్ 300 యూనిట్లకు పెంచాలి



మహబూబ్‌నగర్ రూరల్: దళిత, గిరిజన కాలనీలకు ఇచ్చే ఉచిత విద్యుత్‌ను 101 నుంచి 300 యూనిట్ల వరకు పెంచాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ఎ.రాములు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట కేవీపీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. 101 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం 2018లో 342 జీఓను జారీ చేసిందని తెలిపారు. కానీ కిందిస్థాయిలో సిబ్బంది బిల్లులు వసూలు చేస్తూ ఆయా వర్గాల వారిని ఇబ్బందికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. బిల్లు చెల్లించపోతే కేసులు నమోదు చేస్తూ విద్యుత్ కనెక్షన్ కూడా తొలగిస్తున్నారని వివరించారు. ఉచిత విద్యుత్ అమలు కోసం విద్యుత్ శాఖ ఉద్యోగులు కేవీపీఎస్ నాయకత్వంతో కలిసి సంయుక్త సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బులను తీసుకొని మళ్లీ దళితుల నుంచి కూడా బిల్లులు వసూలు చేయడం సరికాదన్నారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు మాణిక్యంరాజు, పట్టణ అధ్యక్షుడు సత్యం, నాయకులు తదితరులు పాల్గొన్నారు.